

పోలింగ్ విధులు.. బాధ్యతలు
ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజుకు చాలా ప్రాధాన్యముంది. అధికారులు, ఏజెంట్లు బాధ్యతలు కీలకం.
- 8లో



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు
జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు.
- 8లో



ఆమె చుట్టూ ‘సంక్షేమం’
సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు ప్రధాన పాత్ర పోషించనున్నారు. ఫలితాలపై ప్రభావం చూపనున్నారు.
- 8లో

న్యూస్‌రీల్

నేడు పుత్తూరుకు సీఎం వైఎస్ జగన్ రాక



పుత్తూరు: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పుత్తూరుకు రానున్నారు. పట్టణంలో నిర్వహిస్తున్న ‘మేమంతా సిద్ధం’ సభలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం 1.45 గంటలకు సీఎం హెలీక్యాప్టర్‌లో స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కాపువీధి సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకుని ప్రసంగించనున్నారు. 3 గంటలకు పుత్తూరు హెలీప్యాడ్ నుంచి వైఎస్సార్ కడప జిల్లాకు బయలుదేరనున్నారు..గురువారం తిరుపతి జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సభాస్థలిని పరిశీలించారు.

ముగిసిన ‘పోస్టల్’ ఓటింగ్



ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఐదు రోజుల పాటు నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు, హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వృద్ధులు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సాయంత్రం 6 గంటల వరకు ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. మొత్తం ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ పర్యవేక్షించారు. ఓటింగ్ ముగియడంతో ఆర్‌ఓలు బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు. మొత్తం 20,380 మంది పోస్టల్ బ్యాలెట్లకు గాను 17,885 ఓట్లు పోలైనట్లు అధికారులు వెల్లడించారు.

3 గంటలు నిరీక్షించాలా..?

‘మేడమ్..నేను ఓటు వేసేందుకు ఉదయం 10 గంటలకు వచ్చా, సమయం ఒంటి గంట కావొస్తోంది. ఓటేసేందుకు మరీ 3 గంటలు నిరీక్షించాలా..?’ అని ఓ ఉద్యోగి అసహనం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖకు చెందిన ఈ ఉద్యోగి గురువారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు వేసేందుకు వచ్చారు. ఎన్నికల విధులకు కేటాయించిన ఉత్తర్వులు, ఎపిక్ కార్డుచూపించి ఓటు వేసేందుకు అనుమతించాలని కోరారు. అయితే అక్కడి అధికారులు పట్టించుకోకుండా ఉద్యోగిని అక్కడే నిలబెట్టేశారు. దీనిపై ఆగ్రహించిన ఉద్యోగి దీనిపై ఆర్‌ఓకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానమివ్వడం గమనార్హం.

రేపటి నుంచి మద్యం దుకాణాలు బంద్

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లను మూసివేయనున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారి ఆయేషాబేగం గురువారం తెలిపారు. శనివారం సాయంత్రం 6 నుంచి 13వ తేదీ సాయంత్రం వరకు మద్యం దుకాణాలు మూసివేత ఉంటుందని వెల్లడించారు.

ప్రగతి పెరిగె.. చిత్తూరు వెలిగె



చిత్తూరువాసుల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లు

చిత్తూరు.. జిల్లా కేంద్రంగా పాలనకు దిశానిర్దేశం చేస్తున్నా.. పాలకుల నిర్లక్షపు నీడలో ఉండిపోయింది. అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయింది. అయితే ఈ ఐదేళ్లలో చిత్తూరు రూపురేఖలను ప్రభుత్వం పూర్తిగా మార్చేసింది. రూ.వందల కోట్లు వెచ్చించి ప్రగతి పథంలో నడిపించింది. నగరంలో అత్యాధునిక మౌలిక వసతులు కల్పించింది. ఇరుకు రోడ్లను సువిశాలంగా విస్తరించింది. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసింది. ధనికులతో సమానంగా ఆకాశహర్మ్యాలను నిర్మించింది. ఆహ్లాదం పంచేలా అద్భుతంగా పార్కులను తీర్చిదిద్దింది. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాఫిక్ ఇక్కట్లను తొలగించింది. సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచింది. ఒకప్పుడు అపరిశుభ్రంగా.. అధ్వానంగా దయనీయస్థితిలో మగ్గుతున్న చిత్తూరును సకల సౌకర్యాలతో విలసిల్లేలా రూపుదిద్దింది.

- రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు
- నగరవాసులకు తీరిన తాగునీటి కష్టాలు
- పకడ్బందీగా మౌలిక వసతులు
- ఆహ్లాదం పంచేలా పార్కులు
- ట్రాఫిక్ ఇక్కట్ల పరిష్కారానికి డిజిటల్ సిగ్నల్ లైట్లు
- అర్హులందరికీ వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు
- పాల డెయిరీకి పునరుజ్జీవంపై స్థానికుల హర్షాతిరేకాలు



నగరం సరిహద్దులో విశాలమైన రోడ్లు



టెలిఫోన్ కాలనీలో అధునాతన హంగులతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్



నాడు-నేడులో రూపురేఖలు మారిన గిరింపేట మున్సిపల్ పాఠశాల

ప్రజలకు రూ.1136.43 కోట్ల సంక్షేమం

గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించింది. అందులో భాగంగా డీబీటీ ద్వారా నేరుగా చిత్తూరు నియోజకవర్గంలోని 1,83,939 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.508.19 కోట్లు జమ చేసింది. అలాగే నాన్ డీబీటీ పథకాల తో 1,44,702 మందికి రూ.628.24 కోట్ల లబ్ధి చేకూర్చింది. మొత్తంగా ఒక్క చిత్తూరు నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో రూ.1136.43 కోట్ల సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించింది.



లక్ష్మీనగర్‌కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



లాయర్స్‌కాలనీ నిర్మిస్తున్నమురుగు నీటి కాలువలు



కట్టమంచిలో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్

పాల డెయిరీకి ప్రాణం

1945లోనే చిల్లింగ్ ప్లాంట్‌గా ఏర్పడిన చిత్తూరు డెయిరీ 1988లో రోజుకు ఏకంగా 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో ప్రాసెసింగ్ చేసేది. ఇక 1988 నుంచి 1993 మధ్యకాలంలో చిత్తూరు డెయిరీ సగటున రోజుకు 2.50 లక్షల నుంచి 3 లక్షల లీటర్ల ప్రాసెస్ చేసే స్థాయికి చేరుకుంది. అదే సందర్భంలో 1992లో చంద్రబాబు నాయుడు కుటుంబ నేతృత్వంలో హెరిటేజ్ సంస్థ పురుడుపోసుకుంది. దాని ప్రభావం చిత్తూరు డెయిరీపై పడింది. తన సొంత హెరిటేజ్ సంస్థ మనుగడ కోసం లాభాల్లో నడుస్తున్న చిత్తూరు డెయిరీని చంద్రబాబు 2002 ఆగస్టు 31వ తేదీన మూసివేయించారు. ఈ క్రమంలో ప్రస్తుతం ప్రభుత్వం రూ.182 కోట్లు బకాయిలు చెల్లించి మరీ డెయిరీ తలుపులు తెరిపించింది. దేశంలోనే అతిపెద్ద పాల డెయిరీ సంస్థ అమూల్ ద్వారా రూ. 385 కోట్ల పెట్టుబడులతో చిత్తూరు డెయిరీకి ప్రాణం పోసింది. ఈ డెయిరీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా 5వేల మందికి, పరోక్షంగా 2లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



విజయా డెయిరీ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)


సాక్షి చిత్తూరు : జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరానికి ఘనమైన చరిత్ర ఉంది. అయినప్పటికీ దశాబ్దాలుగా వెనుకబడే ఉంది. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసి చంద్రబాబు సొంత జిల్లా అయినా అభివృద్ధికి నోచుకోలేదు. 2019 తర్వాత చిత్తూరుకు మహర్దశ పట్టింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ప్రగతి పథంలో పయనిస్తోంది.

అందుబాటులో పరిపాలన

ప్రభుత్వం విప్లవాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో చిత్తూరు వాసులకు పరిపాలన అందుబాటులోకి వచ్చింది. ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆయా వార్డుల్లోనే అన్ని పనులు పూర్తి చేసుకునే వెసులుబాటు వచ్చింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సైతం లబ్ధిదారులను వెతుక్కుంటూ వారి ఇంటి ముంగిటకే వచ్చే పరిస్థితి వచ్చింది. ఈ క్రమంలోనే నగరంలో అభివృద్ధితోపాటు సుందరీకరణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

అభివృద్ధి పనులు ఇవీ..

- గతంలో చిత్తూరు నగరపాలక పరిధిలోని రోడ్లు అధ్వానంగా ఉండేవి. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితిలో గణనీయంగా మార్పు వచ్చింది. మట్టి దారులతో దయనీయంగా ఉన్న మార్గాలను సైతం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సీసీ రోడ్లుగా మార్చేసింది. ఇందుకోసం రూ.15 కోట్లు వెచ్చించింది.
- నగరపాలక పరిధిలోని 50 వార్డుల్లో ఉండే ప్రజలు వేసవి వచ్చిందంటే తాగునీటికి కటకటలాడేవారు. అందుకే ప్రభుత్వం చిత్తూరు వాసుల దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకుంది. రూ.270 కోట్లతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఫిల్టర్ హౌస్, పంప్ హౌస్, 75 కి.మీ వరకు పైప్ లైన్ పనులు చేపట్టింది. చిత్తూరు ప్రజల నీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. అలాగే 1.90 కోట్లతో తాగునీటి బోర్లు వేయించారు.
- గతంలో సరైన డ్రైనేజీ లేకపోవడంతో వర్షం పడితే రోడ్లపైనే నీరు నిలిచిపోయేది. ఆ సమస్యను అధిగమించేందుకు అన్ని వార్డుల్లో రూ.9.81 కోట్లతో 19.24 కిలోమీటర్ల వరకు డ్రైనేజీలు నిర్మించారు. మురుగు నీరు ఇళ్ల మధ్య నిల్వ చేరకుండా నగరం బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.
- నగర వాసులు సేదతీరేందుకు కార్పొరేషన్ పరిధిలో రూ .2.44 కోట్లతో 6 పార్కులను అభివృద్ధి చేశారు. రూ .52 లక్షలతో పార్కులలో పచ్చదనం పెంపొందించారు. ఈ క్రమంలోనే గంగినేని చెరువును రూ.50 లక్షలతో అభివృద్ధి చేశారు. ఆ పార్కులో పిల్లలు ఆడుకునేందుకు అవసరమైన ఆటల పరికరాలు సమకూర్చారు.
- గతంలో గాంధీ సర్కిల్, కొత్తబస్టాండ్ తదితర ప్రాంతాల్లో విపరీతమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవి. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రూ.50లక్షలు వెచ్చించి అధునాతన టెక్నాలజీ తో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే రూ.50 లక్షలతో రోడ్లపై డివైడర్లు నిర్మించింది.
- ఏళ్ల తరబడి నగరపాలక పరిధిలోని మున్సిపల్ బడులు అభివృద్ధికి నోచుకోని దుస్థితి. ఆయా పాఠశాలలను ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద అద్భుతంగా తీర్చిదిద్దింది. రూ.16 కోట్లతో మున్సిపల్ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించింది.
- నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద రూ.50లక్షలతో లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి వేళ ప్రయాణించేవారు ప్రమాదాల బారిన పడకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది.
- కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా నగరంలోని 4 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఇందుకోసం రూ.3.20 కోట్లు ఖర్చు చేసింది. ఆయా ఆస్పత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టింది.
- గత ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అప్పటి టీడీపీ సర్కారు టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఇళ్లను దాదాపు పూర్తి చేయించింది. మొత్తం 2832 ఇళ్ల నిర్మాణానికి రూ.138 కోట్లు వెచ్చిస్తోంది.



కట్టమంచి చెరువు వ్యూ



మురకంబట్టు వద్ద నిర్మించిన ఫ్లై ఓవర్

భవిష్యత్‌కు భరోసా

- చిత్తూరు నగరంలో ఫుడ్ ప్రాసెస్ యూనిట్ నెలకొల్పేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
- నగర పరిధిలో 37 కిలోమీటర్ల రోడ్ల విస్తరణకు అంగీకారం తెలిపింది.
- మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.75 కోట్ల అభివృద్ధి పనులకు భరోసా కల్పించింది. బీసీ భవన్‌ను శరవేగంగా నిర్మిస్తోంది. కాపు భవన్ నిర్మాణానికి అనుమతులు జారీ చేసింది.



నగర నడిబొడ్డున అభివృద్ధి చేసిన గాంధీ సర్కిల్

కుట్రల ‘కూటమి’కి ఓటమి తథ్యం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కక్ష పెంచుకుని కుట్రలు పన్నుతున్న కూటమి పార్టీలకు ఎన్నికల్లో ఓటమి తథ్యమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. గురువారం కార్వేటినగరంలో ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాండ్లమిట్ట కూడలిలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పగటి వేశగాళ్ల మాయమాటలను నమ్మవద్దని సూచించారు. అధికారం కోసం అమలుకు సాధ్యం కాని హామీలతో వస్తున్న చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, జనసేనకు ఓటేస్తే అది టీడీపీకి వేసినట్లే అని స్పష్టం చేశారు. పేదల అభ్యున్నతికి నిత్యం శ్రమిస్తున్న జగనన్నను ఆదరించి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు. దళితుడిని డిప్యూటీ సీఎం చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారిన షర్మిలమ్మ సొంత అన్నపైనే విమర్శలు గుప్పిస్తోందని, అది మంచి పద్ధతి కాదని స్పష్టం చేశారు. జీడీనెల్లూరు టీడీపీ అభ్యర్థి థామస్ చరిత్రంతా నేరమయమని మండిపడ్డారు. ఆడబిడ్డల అవసరాలను అలుసుగా తీసుకుని వారి పిండాలతో వ్యాపారం చేసే వ్యక్తి థామస్ అని ఆరోపించారు. అడ్డదారిలో సంపాదించిన సొమ్ముతో ఎమ్మెల్యేగా గెలవడానికి మూడు రోజుల క్రితమే 3వందల మంది రౌడీ షీటర్లను చెన్నైనుంచి దించాడని విమర్శించారు. నీతి, నిజాయితీతో ఇన్నేళ్లుగా రాజకీయాలు చేసిన తనపై ఆరోపణలు చేసే అర్హత థామస్‌కు లేదని స్పష్టం చేశారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలను జ్ఞప్తికి తెచ్చుకోవాలని, మరింత సంక్షేమం అందాలంటే వైఎస్సార్‌సీపీ ఓటేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్ రాజు, సర్పంచ్ ధనంజయవర్మ, సుబ్రమణ్యం, పట్నం ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమంతో సుపరిపాలన



ఎన్నికల ప్రచారంలో జనసందోహం (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ, పక్కన ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దపంజాణి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లుగా సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేస్తూ సుపరిపాలన అందించారని పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ కొనియాడారు. గురువారం మండలంలోని రాయలపేట గ్రామంలో ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో వెంకటేగౌడ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నానంటూ గతంలో ప్రకటించిన పరిశ్రమలశాఖ మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. కనీసం ఆయన సొంత పంచాయతీలోని సమస్యలు కూడా పట్టించుకోలేదన్నారు. కేవలం తన జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యతనిచ్చారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పలమనేరు నియోజకవర్గం ప్రగతిపథకంలో పయనిస్తోందన్నారు. ఒక్క పెద్దపంజాణి మండలంలోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూ.345.27 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప మాట్లాడుతూ అవసరాల కోసం ఊసరవెల్లిలా చంద్రబాబు రంగులు మారుస్తారని మండిపడ్డారు. పూటకొక పార్టీతో పొత్తు పెట్టుకొనే చంద్రబాబును ప్రజలు నమ్మరన్నారు. గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల మంచిని కోరే జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రి చేసుకోవాలని, ఎంపీగా రెడ్డెప్పను, ఎమ్మెల్యేగా వెంకటేగౌడను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలమనేరు సూపర్ బజార్ అధ్యక్షుడు సుబాష్‌చంద్రబోస్, పార్టీ నాయకుడు గణేష్‌యాదవ్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సుష్మకీర్తి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సలహాదారుడు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీబాబు, ఆంజమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, జిల్లా కార్యదర్శులు మాకయ్య, తమ్మిరెడ్డి, సుహేబ్, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ సభ్యులు సరస్వతి పాల్గొన్నారు.

ఐటీఐ అడ్మిషన్లకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల ఐటీఐ కళాశాలల్లో అడ్మిషన్లకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కన్వీనర్ రవీంద్రరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులు జూన్ 10వ తేదీ లోపు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు వెళ్లి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 7799933370, 949362 9036 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

దౌర్జన్యాలకు చంద్రబాబు కుట్ర

- అదనంగా కేంద్ర బలగాలను మోహరించండి
- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ తిరుపతి అధ్యక్షుడి ఫిర్యాదు


దొరబాబు

తిరుపతి లీగల్: సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం, తిరుపతి జిల్లాలోని కొన్ని కీలక నియోజకవర్గాల్లో ఎలాగైనా గెలవాలనే దూరాలోచనతో టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడడానికి కుట్రపన్నారని, వెంటనే అదనంగా కేంద్ర బలగాలను మోహరింపజేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్టు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు మునిబాల సుబ్రమణ్యం (దొరబాబు) తెలిపారు. తిరుపతిలో జనసేన పార్టీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి తాను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన సంఘ విద్రోహ శక్తులద్వారా పోలింగ్ బూతులను స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు తిరుపతి రిటర్నింగ్ అధికారిణికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆరణి శ్రీనివాసులు చిత్తూరు నుంచి దాదాపు రెండువేల మంది సంఘ విద్రోహ శక్తులను తిరుపతిలో దించినట్టు తెలిసిందన్నారు. ఇప్పటికే ఆరణి అనుయాయులు ఓటర్లకు నగదు పంపిణీ చేస్తూ అడ్డంగా దొరికారని గుర్తు చేశారు.

కృష్ణయ్యను హతమార్చేందుకు కుట్ర

ఏర్పేడు: బీసీ నేత, రాజ్య సభ్యుడు ఆర్.కృష్ణయ్యను హతమార్చేందుకు టీడీపీ నాయకులు కుట్ర చేయడం దుర్మార్గమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్.కృష్ణయ్యపై రాళ్లదాడి అనంతరం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఏర్పేడు సభలో ఆర్.కృష్ణయ్యపై రాయితో దాడి చేయడం పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. మగతనం ఉంటే తమను నేరుగా ఎదుర్కోవాలని, దొంగచాటుగా దాడి చేయడం తగదన్నారు. ఇలాంటి దాడులు చేసే సంస్కృతి శ్రీకాళహస్తిలో కొనసాగనివ్వనన్నారు. ఇదే ఏర్పేడులో 16 మందిని పొట్టనపెట్టుకున్నారని, మళ్లీ చంపాలని కుట్ర చేసి రాళ్లదాడులు చేయడం హేయమైన చర్య అన్నారు.

గంగమ్మకు రూ.12.24 లక్షల ఆదాయం

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోని అమ్మవారి హుండీ లెక్కింపు ద్వారా రూ.12,24,006 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ ఎం.మమత తెలిపారు. ఈ మేరకు గురువారం అమ్మవారి ఆలయంలో హుండీ లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ, సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ విధులు.. బాధ్యతలు

ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజుకు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. ఓటింగ్ నుంచి ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించే వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. ఇందులో పోలింగ్ అధికారుల.. రాజకీయ పార్టీల ఏజెంట్ల పాత్ర కీలకంగా ఉంటుంది. పోలింగ్ ముగిసిన అనంతరం సిబ్బంది, ఏజెంట్లు అనుసరించాల్సిన విధివిధానాలపై కథనం.

- ఇక మూడు రోజుల్లో సార్వత్రిక ఎన్నికలకు ఓటింగ్
- అధికారులు.. ఏజెంట్ల పాత్ర కీలకం
- సమన్వయంతో ప్రక్రియ పూర్తి చేయడమే లక్ష్యం


పీఓలకు ఎన్నికల విధులపై శిక్షణ ఇస్తున్న చిత్తూరు అసెంబ్లీ ఆర్ఓ శ్రీనివాసులు (ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తి చేశారు. అయితే పోలింగ్ అధికారులతోపాటు పోలింగ్ నాడు ఆయా రాజకీయ పార్టీల ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకం. ఈ నెల 12వ తేదీన సిబ్బంది కేటాయించబడిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు ఒక రోజు ముందే ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లోని రిటర్నింగ్ అధికారుల నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకోవాలి. పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తరపున వచ్చిన ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఈ ప్రక్రియ ఉదయం 6.30 గంటల లోపే ముగించాల్సి ఉంటుంది. మాక్ పోలింగ్ లో 50కి తగ్గకుండా ఓట్లు వేసి ఏజెంట్ల సమక్షంలో లెక్కిస్తారు. ఇందులో నోటాకు సైతం ఓట్లు వేసి పరిశీలించాల్సి ఉంటుంది. అన్ని సరిగ్గానే ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత వారి సమక్షంలో యంత్రాలను క్లియర్ చేసి ఓటింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. ఉదయం 7 గంటలకు ఓటింగ్‌ను అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రారంభించాల్సి ఉంటుంది.

ఇద్దరు రిలీఫ్ ఏజెంట్లు

పోలింగ్ కేంద్రాలలో అభ్యర్థుల తరపున పోలింగ్ ఏజెంట్లు ఉంటారు. ప్రతి అభ్యర్థి తరపున ఒక పోలింగ్ ఏజెంటు ఇద్దరు రిలీఫ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు. అందులో ఒకరికి మాత్రమే కూర్చోడానికి అవకాశం ఉంటుంది.

ఎప్పటికప్పుడు వివరాలు

ఓటింగ్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని ఎన్నికల అధికారులు అధికారికంగా వెల్లడిస్తారు. అనంతరం సెక్టోరల్ అధికారుల ద్వారా జిల్లా ఎన్నికల అధికారులకు సమాచారం అందిస్తారు.

పోలింగ్ అధికారుల విధులు ఇలా.....

పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వర్తించే సిబ్బందిదే బాధ్యత. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితో పాటు ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి మరో ఇద్దరు అధికారులు ఎన్నికల నిర్వహణ బాధ్యతల్లో ఉంటారు. పోలింగ్ కేంద్రం మొత్తం బాధ్యతను ప్రిసైడింగ్ అధికారి (పీఓ) పర్యవేక్షిస్తారు.

ముగింపు వెల్లడించాలి

పోలింగ్ సమయం ఈ నెల 13 వ తేదీన సాయంత్రం 6 గంటలకు ముగుస్తుండగా 15 నిమిషాల ముందే పీఓలు సమయాన్ని వెల్లడించాల్సి ఉంటుంది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ కేంద్రం లోపల ఉన్న వారందరూ ఓటు వేయడానికి అర్హులే. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కంట్రోల్ యూనిట్‌లో క్లోజ్ బటన్ నొక్కుతారు.

కౌంటింగ్ కేంద్రాలకు చేరేదిలా..

పోలింగ్ ముగిసిన వెంటనే సీల్ వేసి క్లోజ్ చేసిన ఈవీఎం యంత్రాలను సంబంధిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రిసీవింగ్ సెంటర్లకు చేరుస్తారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి చిత్తూరులోని ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలను తరలిస్తారు. ఈ సమయంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు, నిఘా కల్పిస్తారు. కౌంటింగ్ కేంద్రంలో ప్రత్యేకంగా ఆయా నియోజకవర్గ కేంద్రాల వారీగా వాటిని భద్రపరచి గదులకు సీల్ వేస్తారు. అనంతరం కౌంటింగ్ తేదీన వాటిని ఓపెన్ చేస్తారు.

బీసీ సీటును కబ్జా చేసిన బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పక్కన వెంకటరెడ్డి యాదవ్

పుంగనూరు : కుప్పం నియోజకవర్గంలో బీసీల జనాభా అధికమని, ఈ సీటును 30 ఏళ్లుగా చంద్రబాబు కబ్జా చేశారని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మండిపడ్డారు. గురువారం పుంగనూరులో నిర్వహించిన వన్నెకుల క్షత్రియ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ తర్వాత బీసీలకు ఉన్నత పదవులు కట్టబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని కొనియాడారు. బలహీన వర్గాలకు ఆత్మస్థైర్యం పెంచి, నవరత్న పథకాలతో అండగా నిలిచిన ఏకైక వ్యక్తి జగనన్నే అని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బలహీనవర్గాల అభ్యున్నతికి ఎనలేని సాయం చేశారని వెల్లడించారు. ఈ స్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రం దేశంలోనే లేదన్నారు. ఇదేవిధంగా సంక్షేమ ఫలాలు అందాలంటే వైఎస్సార్‌సీపీనే గెలిపించాలని కోరారు. ఓట్ల కోసం మాయమాటలతో వస్తున్న చంద్రబాబును నమ్మవద్దని సూచించారు. 13వ తేదీన పోలింగ్ నాడు ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు వేలురామ్, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చెంగారెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, శంకర్‌రెడ్డి, మునిరెడ్డి, హరి, కిరణ్, విజయ్, సురేష్, లోకేష్, షణ్ముగం పాల్గొన్నారు.

మద్యం..నగదు పంపిణీపై ప్రత్యేక నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయ పార్టీలు మద్యం, నగదు పంపిణీ చేయకుండా పర్యవేక్షణ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అబ్జర్వర్ల సమక్షంలో వరుస సమావేశాలు నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పోలింగ్‌కు సమయం దగ్గర పడుతోందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ రోజున ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ సిబ్బంది అందరికీ గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని చెప్పారు. రిసెప్షన్ కౌంటర్‌లో చెక్‌లిస్ట్ మేరకు పోలింగ్‌కు అవసరమైన సామాగ్రిని పంపిణీ చేయాలన్నారు. ఈ నెల 11వ తేదీన వెబ్ కెమెరాల నిర్వహణపై బీఎల్‌ఓలకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలొస్తే టెక్నిషియన్‌లు వెంటనే స్పందించేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అబ్జర్వర్ షాదిక్ అలం మాట్లాడుతూ పోలింగ్ రోజున ప్రతి నియోజకవర్గంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలింగ్ సరళిని పర్యవేక్షించాలన్నారు. పోలీస్ అబ్జర్వర్ అరవింద సాల్వే మాట్లాడుతూ సమస్యాత్మక కేంద్రాలలో శాంతిభద్రతలకు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. వ్యయ అబ్జర్వర్ రోహన్ ఠాగూర్ మాట్లాడుతూ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సమావేశంలో చిత్తూరు అసెంబ్లీ ఆర్ఓ శ్రీనివాసులు, ఇతర నియోజకవర్గాల ఆర్ఓలు మనోజ్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటశివ, చిన్నయ్య, వెంకటరెడ్డి, మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

10వ తేదీకి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు

జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఈ నెల 10వ తేదీ నాటికి పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేసి సెక్టోరల్ అధికారులకు అప్పగించాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు పక్కాగా ఉండాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీఈఓ దేవరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు


పార్టీలో చేరిన నేతలతో ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి


పార్టీలో చేరిన టీడీపీ నేతలతో వైఎస్సార్‌సీపీ నాయకులు

చిత్తూర్ రూరల్(కాణిపాకం): జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం ఈ మేరకు చిత్తూరు మండలంలోని దిగువ మాసాపల్లి పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రాజేష్ నాయుడు, బాబు నాయుడు, సదాశివ నాయుడు, అశోక్ నాయుడు, తేజ నాయుడు, రమేష్ నాయుడు, వెంకటేష్ నాయుడు ఉన్నారు.

గంగవరంలో..

గంగవరం : మండలంలోని మామడుగు, డ్రైవర్ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు షాదిక్, మహమ్మద్, అమీన్‌షేక్, మేలుమాయి పంచాయతీ కొత్తూరు, మోతుకులపల్లె గ్రామాలకు చెందిన నేతలు మునిరత్నం, గుర్రప్ప, రమణారెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, సీనియర్ నాయకులు మణి, మామడుగు సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, మేలుమాయి ఎంపీటీసీ సభ్యుడు శ్రీధర్, వినోద్‌రెడ్డి, పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఈ నెల 12,13 తేదీల్లో పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలనుకుంటే ముందస్తు అనుమతి తప్పనిసరని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎంసీఎంసీ కమిటీ ధ్రువీకరణ పత్రాలు లేకుండా . పత్రికా యాజమాన్యాలు కూడా ప్రకటనలు ప్రచురించకూడదని స్పష్టం చేశారు. పార్టీల తరపున ఏదైనా సంస్థ కానీ, వ్యక్తి కానీ ఇచ్చే యాడ్‌లకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందని వెల్లడించారు.

ఆమె చుట్టూ సంక్షేమం

- జిల్లాలో మహిళా ఓటర్లే కీలకం
- పురుషుల కంటే 23,528 మంది అధికం
- అతివలకు ఎనలేని మేలు చేసిన ప్రభుత్వం
- ఏడు స్థానాల్లో గెలుపోటములను ప్రభావితం చేయనున్న నారీలోకం



చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికలకు ఇక మూడు రోజులే సమయం ఉంది. ఈ నెల 13వ తేదీ న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకంగా మారనున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పురుష ఓటర్లతో పోల్చితే 23,528 మంది మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. టీడీపీ పాలనలో మహిళల అభివద్ధికి చేసిందేమి లేదు. గత ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం ప్రస్తుత ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి వారి అభ్యున్నతికి కృషి చేసింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటముల్లో వీరి ఓట్లు కీలకం కానున్నాయి. ప్రస్తుత సర్కారులో జరిగిన మహిళా సంక్షేమానికి మహిళా ఓటర్లు మద్దతు పలుకుతున్నారు.

అంతటా వారే..

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుష ఓటర్లు 7,70,154 మంది, మహిళా ఓటర్లు 7,93,682 మంది, ఇతరులు 75 మంది ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉండడం విశేషం. ఏడు నియోజకవర్గాలకు గాను పలమనేరు నియోజకవర్గంలో 1,35,243 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఆ తర్వాత పుంగనూరు నియోజకవర్గంలో 1,21,791 మంది, కుప్పంలో 1,13,247, పూతలపట్టులో 1,12,181, చిత్తూరులో 1,04,101, నగరిలో 1,04,029, గంగాధరనెల్లూరులో 1,03,090 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

చేసినవే కాదు...కొత్తవి కూడా..

ప్రస్తుత సర్కారు 2019 లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళ సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసింది. గత ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం అన్ని హామీలను నెరవేర్చి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేసింది. ఈ ఎన్నికల్లో గతంలో కంటే అధికంగా మహిళలకు లబ్ధి చేకూరేలా మేనిఫెస్టోను రూపొందించింది.

సొంతింట్లో హాయిగా..



గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలని ఉండేవి. ఆ కమిటీల సమావేశాలకు వెళ్లి ఇల్లు మంజూరు చేయాలని చాలా సార్లు అర్జీలు ఇచ్చాం. వాళ్లు తీసుకున్నారు. కానీ న్యాయం మాత్రం జరగనేలేదు. మాది పెంకుటిల్లు కావడంతో వానా కాలం వస్తే ఎక్కడ కూలిపోతుందో అని బిక్కు బిక్కుమంటూ భయపడుతూ ఉండేవాళ్లం . ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న మా కుటుంబానికి ఈ ప్రభుత్వంలో న్యాయం జరిగింది. ఉచితంగా విలువైన ఇంటి పట్టా ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సహాయం చేశారు. ప్రస్తుతం సొంతింట్లో హాయిగా ఉంటున్నాం.

- ఫౌజుల్లాబీ, ఎంకే పురం, శాంతిపురం మండలం

మాట నిలబెట్టుకున్నారు....



ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం ఆరు గంటలకే మా ఇంటి వద్దకు వచ్చి వలంటీర్ పింఛన్ నగదు అందజేసేవారు. గతంలో పింఛన్ పొందాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఉండేది. మండల కార్యాలయం వద్ద పడిగాపులు కాసేవాళ్లం. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న రూ.3 వేలు పింఛన్ ఇచ్చారు. మాట నిలబెట్టుకున్నారు.

- జె.సుగుణ, ప్రశాంత్ నగర్, చిత్తూరు

గతంలో మాటలే..



గతంలో నాయకులు మాటలు తప్ప చేతల్లో ఏమీ సహాయం చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం వల్లే మాకు మేలు జరిగింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వం నెరవేర్చింది. ఎన్నికల సమయంలో ఓట్ల మాత్రమే కాకుండా ప్రజలకు మేలు చేసింది. గత పాలకులు ఎన్నికల సమయంలో లేని పోని కపట హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక నెరవేర్చేవారు కాదు. నాకు ప్రతి నెలా ఒకటో తేదీనే వితంతు పింఛన్ అందుతోంది.

- ఏ.ఉషారాణి, మసీదుమిట్ట, చిత్తూరు

సంతోషంగా ఉంటున్నాం



ఇంటి కోసం గత పాలకుల వద్ద ఎన్నో సార్లు తిరిగా. ఏ మాత్రం న్యాయం జరగలేదు. కనీసం సమాధానం కూడా చెప్పలేదు.దీంతో మా ఊర్లో గ్రామస్తులను వేడుకుని స్కూలు వంట గదిలో చాలా సంవత్సరాలు ఉన్నాం. నా భర్త తాపీ మేస్త్రీ పని చేస్తారు. వచ్చే కూలీ అంతంత మాత్రమే. సంపాదించేదంతా కుటుంబం గడిచేందుకు, ఐదుగురు ఆడపిల్లలను పోషించుకునేందుకు సరిపోతుంది. ఈ సర్కారు వచ్చాక మేము అడగకనే ఉచితంగా ఇంటి పట్టా ఇచ్చారు.

- జ్యోతిదేవి, పాన్నేపల్లె, శాంతిపురం మండలం

ఈ ప్రభుత్వంలోనే మేలు జరిగింది



ఈ ప్రభుత్వంలోనే మాకు మేలు జరిగింది. గత పాలకులు వారికి అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే పథకాలు అందించారు. మాలాంటి పేదలను ఏ మాత్రం పట్టించుకోలేదు. నా భర్త సోమప్ప, నేను కూలీ పనులు చేస్తుంటాం. అదే మాకు బతుకు దెరువు. లక్షల కొద్ది మాకు డబ్బులు ఎక్కడ నుంచి వస్తాయి. ఇంటి పట్టా కోసం గత పాలనలో మొరపెట్టుకున్నాం. ఎవ్వరూ పట్టించుకోలేదు.

- రాజేశ్వరి, పాన్నేపల్లె, శాంతిపురం మండలం

25 నుంచి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వర పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి పలు రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈమేరకు ఈనెల 25 నుంచి కళాశాలలో దరఖాస్తులను జారీచేస్తారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 12వ తేదీ వరకు స్వీకరిస్తారు. ఎస్వీ సంగీత, నృత్య కళావాలలో గాత్రం, వయోలిన్, వీణ, ఫ్లూట్, నాదస్వరం, భరతనాట్యం, హరికథ, మృదంగం, డోలు, ఘటం విభాగాల్లో ఫుల్‌టైం విశారద డిప్లొమా, ప్రవీణ్ అడ్వాన్స్ డిప్లొమా కోర్సులు ఉన్నాయి. ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాలలో ఫుల్ టైమ్ సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు ఉన్నాయి. ఇతర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు కళావాలలో రూ.50 చెల్లించి దరఖాస్తు పొందవచ్చు. వివరాలకు 0877–2264597, 7330811173, 9848374408, 9440793205లలో సంప్రదించాలని కళాశాల యాజమాన్యం సూచించింది.

పార్ట్‌టైమ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో 2024–25 ఏడాదికి సంబంధించి సాయంత్రం పార్ట్‌టైమ్ సర్టిఫికెట్, డిప్లొమా, కళాప్రవేశిక కోర్సుల ప్రవేశానికి ఈనెల 25 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల వరకు పార్ట్‌టైమ్ కోర్సులలో గాత్రం, భక్తి సంగీతం, వీణ, వయోలిన్, వేణువు, మృదంగం, ఘటం, భరతనాట్యం, కూచిపూడి నృత్యం విభాగాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కళాశాలలో హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్ కోర్సు నాలుగేళ్లు, రెండేళ్ల డిప్లొమా కోర్సు ఉన్నాయని పేర్కొన్నారు. టీటీడీ నిర్వహించే రెండేళ్ల ఫౌండేషన్ కోర్సు కళాప్రవేశిక ఉందని తెలిపారు. రూ.50 చెల్లించి కళాశాల కార్యాలయం పని వేళల్లో దరఖాస్తు పొందవచ్చని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులు మే 25వ తేదీ నుంచి అన్ని జిరాక్స్ కాపీలతో కలిపి జూన్ 12వ తేదీలోపు సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు పై నున్న నంబర్లు లేదా టీటీడీ వెబ్ సైట్ ww-w.-tir uma a.o-r-fలో సంప్రదించాలని కోరారు.

చిత్తూరు తిరుపతి జిల్లాల్లో 2019 ఎన్నికల ఫలితాలు మరోసారి పునరావృతం కానున్నాయి. 2024 ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించే దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే విజయ బావుటా ఎగురవేస్తాయని చర్చ మొదలైంది. మరోవైపు గత ప్రభుత్వాలకు భిన్నంగా ప్రస్తుత నేతలు నిత్యమూ ప్రజలతో మమేకమైన తీరు, ఆపత్కాలంలోనూ అండగా ఉంటున్న వైనం ప్రజల మనసులను గెలిచేలా చేశాయి. ఇలాంటి పాలనే తమకు కావాలంటూ వారిచేత వన్స్‌మోర్ అనిపిస్తున్నాయి..

– సాక్షి, తిరుపతి

- మరోసారి వైఎస్సార్‌సీపీకే పట్టం చిత్తూరు, తిరుపతి జిల్లాల ఓటర్లు
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే విజయ బావుటా
- మెజారిటీపైనే అందరి చర్చ
- ప్రచారంలో నేతల జోరు

తిరుపతి, చిత్తూరు

ఫ్యాన్ జోరు

చిత్తూరు పార్లమెంట్‌లో రెడ్డెప్ప విజయం తథ్యం

రాయలసీమ ప్రాంతంలోని చిత్తూరు జిల్లాలో టీడీపీ ఎప్పుడూ వెనుకబడే ఉంది. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. అతిరథ మహారథులు పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేశారు. పార్లమెంట్ ఆవిర్భావం అనంతరం మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ హవా కొనసాగింది. 16 సార్లు ఎన్నికలు జరిగితే 8 పర్యాయాలు కాంగ్రెస్ అభ్యర్థికే పట్టం కట్టారు. 2009లో చిత్తూరు పార్లమెంట్ ఎస్సీలకు కేటాయించారు. 2009, 2014లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన ఎన్ శివప్రసాద్ గెలుపొందారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన రెడ్డెప్ప విజయం సాధించారు. టీడీపీ నుంచి మూడవసారి పోటీచేసిన శివప్రసాద్, కాంగ్రెస్ అభ్యర్థి రంగప్ప, బీజేపీ నుంచి పోటీ చేసిన దుగ్గాని జయరాం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సునామీలో కొట్టుకుపోయారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రెడ్డెప్ప న్యాయవాదిగా అనుభవం ఉంది. రాష్ట్ర లిడ్‌క్యాప్ చైర్మన్‌గా పనిచేశారు. దివంగత టీడీపీ అభ్యర్థి శివప్రసాద్ రెండు పర్యాయాలు ఎంపీగా ఉన్నా నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని తిరుపతి పరిసర ప్రాంతాల్లో విలువైన మఠం భూములను ఆక్రమించుకున్నారనే విమర్శలున్నాయి. ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మరోసారి రెడ్డెప్ప పోటీచేస్తున్నారు. కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న ప్రసాదరావు తెలంగాణాకు చెందిన వ్యక్తి, స్థానికేతరుడు కావడంతో ఓటమి తప్పదని జిల్లా ప్రజలు తేల్చిచెబుతున్నారు.ఐదేళ్లలో జిల్లాకు చేసిన అభివృద్ధే రెడ్డెప్పను మరోసారి విజయతీరానికి చేరుస్తాయని ఓటర్లు చెబుతున్నారు.

పెద్దాయనదే పుంగనూరు

చిత్తూరు జిల్లాలో అతిపెద్ద నియోజక వర్గం పుంగనూరు. మున్సిపాలిటీ, మరో ఆరు మండలాలు ఉన్నాయి. నియోజక వర్గాల పునర్విభజనలో 2009లో పుంగనూరు అసెంబ్లీగా ఏర్పాటైంది. అప్పటి వరకు పీలేరు ఎమ్మెల్యేగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 2009 నుంచి పుంగనూరు అసెంబ్లీ అభ్యర్థిగా గెలుపొందుతూ వస్తున్నారు. తన కుటుంబానికి కంచుకోటగా పుంగనూరును తీర్చిదిద్దారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ పుంగనూరు అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా చల్లా రామచంద్రారెడ్డి పోటీ చేస్తున్నారు. పెద్దిరెడ్డిని ఓడించడం సాధ్యం కాకపోవడంతో కనీసం మెజారిటీ అయినా తగ్గించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఏకమయ్యాయి. వీరితో పాటు స్థానిక నాయకుడు రామచంద్రయాదవ్ వారితో చేతులు కలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా పరిస్థితి అనుకూలంగా లేకపోవటంతో అల్లర్లకు తెరలేపారు. చల్లా బాబు, రామచంద్రయాదవ్ విధ్వంసాలకు రకరకాల కుట్రలు చేస్తున్నారు. ఎవరెంత చేసినా అంతిమ విజయం పెద్దిరెడ్డిదేనని స్థానికులు ఘంటాపదంగా చెబుతున్నారు.

ఈనెల 4న పలమనేరు బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి (ఫైల్)



బాబుకు బైబై చెప్పనున్న కుప్పం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గం. 1989 నుంచి చంద్రబాబు పోటీ చేస్తున్నారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2019 ఎన్నికలకు సంబంధించి లెక్కింపులో మొదటి రెండు రౌండ్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంటే చంద్రబాబు వెనుకపడటంతో షాక్ గురయ్యారు. ఓటమి తప్పదేమోనని ఇటు చంద్రబాబు, అటు టీడీపీ నేతలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చివరకు దొంగ ఓట్లతో బయటపడ్డారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్నా ఆయన కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయారు. సాగు, తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వివక్ష చూపకుండా సంక్షేమ పథకాలతో రూ.1,400 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమచేసింది. మరో రూ.1,200 కోట్లకు పైగా వెచ్చించి కుప్పం నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేసింది. ముఖ్యంగా హంద్రీ–నీవా కాలువతో కుప్పానికి కృష్ణా జలాలు తీసుకువచ్చి స్థానికుల దశాబ్దాల కలను సాకారం చేశారు. అంతేకాకుండా కుప్పాన్ని రెవెన్యూ, పోలీస్ డివిజన్ చేయడంతో పాటు మున్సిపాలిటీని చేయడం సంచలనం కలిగించింది. కుప్పం చరిత్రలో చంద్రబాబు తన పాలనలో మునుపెన్నడూ చేయని అభివృద్ధిని సీఎం వైఎస్ జగన్ చేసి చూపడమే దీనికి కారణమైంది. 4 దశాబ్దాలుగా కుప్పానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా చంద్రబాబు చేసిందేమీ లేదని, స్థానికంగా ఉండడం లేదని, కరోనా విపత్తు సమయంలో కూడా పూర్తిగా ముఖం చాటేశారని ప్రజల్లో వ్యతిరేకత మూటకట్టుకున్నారు. మరోవైపు స్థానికంగా అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజలతో మమేకమైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ భరత్‌ని గెలిపించి బాబుకు శాశ్వతంగా బైబై చెప్పాలనే ఆలోచనలో ఓటర్లు ఉన్నట్టు ప్రస్తుత పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి.

చిత్తూరులో టీడీపీ చిత్తే

జిల్లా కేంద్రమైన చిత్తూరుకు ఉన్న ప్రత్యేక గుర్తింపును చంద్రబాబు సర్వనాశనం చేశారు. చంద్రబాబు సీఎం అయ్యాక పాడి, చెరకు రైతులకు కల్పతరువైన చిత్తూరు విజయా డెయిరీ, సహకార చక్కెర కర్మాగారాన్ని ఒక పథకం ప్రకారం మూయించారు. తర్వాత ముఖ్యమంత్రి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయా డెయిరీ పునఃప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం రూ.350 కోట్లతో డెయిరీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి స్థానికులకు సుపరిచితుడు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంతో రీజియన్ పరిధిలో కొత్త బస్సులను తీసుకువచ్చారు. దీర్ఘకాలంగా ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించారు. మరోవైపు సామాజిక సేవలతో ప్రజలకు మరింత చేరువయ్యారు. చిత్తూరులో వ్యాపారం చేసుకునే రైతులు, చిరు వ్యాపారులకు అండగా ఐదేళ్లుగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు మార్కెట్ గేటు రుసుం పెద్దమొత్తంలో చెల్లిస్తున్నారు. 35 మంది పేద నిరుపేద విద్యార్థులకు ఎల్‌కేజీ నుంచి బీటెక్, ఎంసీఏ, వరకు తానే ఫీజు భరిస్తూ వారి భవితకు బాటలు వేస్తున్నారు. వీరిలో ఐదుగురిని విదేశాల్లో చదివిస్తున్నారు. ఇంకా రూ.2 కోట్లు వెచ్చించి నిరుపేదలకు ఉచితంగా తోపుడు బండ్లు, బంకులు, కిరాణా దుకాణాలు పెట్టించారు. మరో రూ.10 కోట్లకు పైగా వెచ్చించి పిరమిడ్ ధ్యాన కేంద్రం, యువతను ప్రోత్సహిస్తూ ప్రతి ఏటా క్రికెట్ టోర్నమెంట్, ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా ఇస్తున్నారు. కరోనా సమయంలో క్వారంటైన్‌లో ఉన్న బాధితులకు ఉచిత భోజన వసతి, వరదలకు దెబ్బతిన్న రోడ్లను తన సొంత నిధులతో బాగుచేయించారు. మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ బరిలో ఉన్నారు. ఇతను వ్యాపారవేత్త. మొన్నటి వరకు ఇతను జనంతో సంబంధం లేకుండా గడిపారు. స్వస్థలం గుడిపాలే అయినా.. బెంగుళూరులో సెటిల్ అయ్యారు. టీడీపీ శ్రేణులకు పరిచయం లేని వ్యక్తి.

వైఎస్సార్ కుటుంబానికి కంచుకోట గంగాధర నెల్లూరు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి వీరాభిమానులు ఉన్న నియోజకవర్గమిది. అందుకే ఇక్కడ నాడు వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గుమ్మడి కుతూహలమ్మను ఎమ్మెల్యేగా గెలిపించారు. ఆయన మరణానంతరం వైఎస్సార్ ఆశయాలతో ఆవిర్భవించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసిన నారాయణస్వామి జనం పట్టం కట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించారు. సీఎం సహకారంతో ఐదేళ్ల కాలంలో నారాయణస్వామి రూ.1,550 కోట్లకు పైగా ప్రభుత్వ నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన కుమార్తె కృపాలక్ష్మిని సీఎం ఎన్నికల బరిలోకి దింపారు. చేసిన తండ్రి చేసిన అభివృద్ధి పనుల దృష్ట్యా ఈసారి ఆమెకు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ థామస్ నియోజకవర్గానికి కొత్త. చెన్నైలో నివాసం ఉంటున్న ఆయన అభ్యర్థిత్వంపై పార్టీలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది అధిష్టానానికి తలబొప్పి కట్టిస్తోంది. చెన్నైలో తనపై మర్డర్ కేసుతో పాటు పలు క్రిమినల్ కేసులు కూడా ఉన్నట్లు థామస్ తన అఫిడవిట్‌లో పొందుపరచటం గమనార్హం.

సునీల్‌కే పూతల'పట్టు'

చిత్తూరుకు కూతవేటు దూరంలో ఉన్న పూతలపట్టు నియోజకవర్గం ఈ ఐదేళ్ల కాలంలో అభివృద్ధి పథంలో దూసుకుపోయింది. నియోజకవర్గంలో రూ.765.15 కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రభుత్వం చేసింది. మరో వైపు రూ.742.70 కోట్లు వివిధ సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం లబ్దిదారుల బ్యాంకు ఖాతాలో జమచేసింది. వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాలతో ఉన్న పరిచయానికి తోడు నవరత్నాల పథకాల పథకాల ఫలాలు పార్టీకతీతంగా అర్హులందరికీ అందడం ఆయనకు మరోసారి కలిసొస్తున్న అంశం. టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ అభ్యర్థిత్వాన్ని స్థానిక టీడీపీ నేతలు మొదటి నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నారు. విభజించు–పాలించు అనే రకంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో నడుచుకుంటున్నారనే ప్రచారం ఉంది. తాను అభ్యర్థి, తాను చెప్పిందే వేదం అనే చందంగా వ్యవహరిస్తుండటంతో స్థానిక నేతలు ఆయనపై గుర్రుగా ఉన్నారు. ఏ రకంగా చూసినా పూతలపట్టులో వైఎస్సార్‌సీపీ మరోసారి జెండా ఎగురవేయనుంది.

ఆర్‌కే రోజా అడ్డా నగరి

మంత్రి ఆర్‌కే రోజా ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం. నగరి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆర్‌కే రోజాకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంత్రిని చేశారు. ఈమె ఏపీఐఐసీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఐదేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్ సహకారంతో రూ.521.6 కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేశారు. మరో రూ.1,200కు పైగా నిధులను రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అకౌంట్లలో నేరుగా జమచేసిది. అలాగే సొంత నిధులతో నిరుపేదల ఆకలి తీర్చాలనే సదుద్దేశంతో రూ.4 కే భోజనం, రూ.2కే 20 లీటర్ల తాగునీరు, ప్రభుత్వ పాఠశాలలకు ఫ్యాన్లు, ఆర్వో ప్లాంట్లు అందించారు. అదే విధంగా యువతకు క్రికెట్ పోటీలు, మెగా జాబ్‌మేళా, ఆరోగ్యశిబిరాలు నిర్వహించి జనంలో మన్ననలు పొందారు. ప్రతి బుధవారం నగరి, పుత్తూరు ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణులు, వారి సహాయకులు తన ట్రస్ట్ ద్వారా పౌష్టికాహారం పెడుతున్నారు. 2014లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. నాటి టీడీపీ హయాంలో చంద్రబాబు ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించకుండా వివక్ష చూపింది. అయినసూ ఆమె కుంగిపోలేదు. సొంత నిధులతో పలు అభివృద్ధి, సంక్షేమ, సేవా కార్యక్రమాలతో శభాష్ అనిపించుకున్నారు. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా దివంగత మాజీ మంత్రి గాలిముద్దుకృష్ణమ నాయుడు కుమారుడు గాలి భానుప్రకాష్ ఉన్నారు. తండ్రి మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తీవ్రంగా నష్టపోయిన నాయకులు ఉన్నారు. ప్రస్తుతం గాలి భానుప్రకాష్‌పై కుటుంబ సభ్యులే కాకుండా... పార్టీ కేడర్ కూడా తీవ్ర అసంతృప్తితో ఉంది. ఏ రకంగా చూసినా ఇక్కడ మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడటం ఖాయంగా కనిపిస్తోంది.

అమర్‌కి చుక్కలు చూపించనున్న పలమనేరు

కుప్పానికి అతి దగ్గరలో ఉన్న నియోజక వర్గం పలమనేరు. కుప్పంలాగే పలమనేరు నియోజక వర్గాన్ని టీడీపీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. 2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తుతో గెలిచి మంత్రి పదవి కోసం టీడీపీలోకి జంప్ అయిన అమర్‌నాథ్‌రెడ్డి పట్ల జనం తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రెండేళ్లపాటు మంత్రి పదవిలో ఉన్నా తన స్వప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు తప్పితే నియోజకవర్గానికి చేసిందేమీ లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఆయన అనుచరులదీ ఇదే బాట. నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడ్డారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో స్థానికులు అమర్‌నాథ్‌రెడ్డి తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పోటీ చేసిన వెంకటేగౌడ్ భారీ మెజారిటీతో గెలిపించారు. ఈ ఐదేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.2,210 కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. మరో రూ.425 కోట్లకుపైగా నిధులతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేశారు. అమర్ తీరుతో విసిగి వేశారిన నియోజకవర్గంలోని పలువురు పార్టీ సీనియర్ నాయకులు, సాక్షాత్తు అమర్ సోదరుడు శ్రీనాథరెడ్డి తన సతీమణి అనూషారెడ్డితో సహా వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అర్హులందరికీ అందించిన సంక్షేమానికి తోడు అమర్‌పై ఉన్న తీవ్ర వ్యతిరేకత మరోసారి వెంకటేగౌడ ఎమ్మెల్యే కావడం తథ్యమని ఓటర్లు చెబుతున్నారు.

తిరుపతి ఎంపీ వైఎస్సార్‌సీపీదే 'గురు'

తిరుపతి పార్లమెంట్ పరిధిలో 1952 నుంచి 2021 దాకా 17 సార్లు జరిగిన ఎన్నికల్లో 12 సార్లు కాంగ్రెస్ పార్టీ గెలవగా, మూడు సార్లు వైఎస్సార్‌సీపీ, ఒక్కోసారి టీడీపీ, బీజేపీ గెలిచాయి. 1984 తరువాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఒక్కసారి కూడా గెలిచిన దాఖలాల్లేవు. 2024లో కూడా మరోమారు వైఎస్సార్‌సీపీ హవా కొనసాగనుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి మరోమారు ఎంపీగా ఘన విజయం సాధించనున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 2,28,376 ఓట్ల మెజారిటీతో బల్లి దుర్గాప్రసాద్ విజయం సాధించారు. అప్పటిదాకా తిరుపతి పార్లమెంట్ చరిత్రలో అదే అత్యధిక మెజారిటీ. ఆయన మరణంతో 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో మద్దెల గురుమూర్తి 2,71,592 ఓట్ల మెజారిటీతో విజయ ఢంకా మోగించారు.

చంద్రగిరి కోట చెవిరెడ్డిదే

నారా చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం చంద్రగిరిలో ఎన్టీఆర్ హయాంలో నారా రామ్మూర్తినాయుడు మాత్రమే టీడీపీ తరఫున ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత మూడు పర్యాయాలు కాంగ్రెస్ తరఫున గల్లా అరుణకుమారి గెలుపొందుతూ వచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో 2014, 2019లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఘన విజయం సాధించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో రూ.2,327 కోట్లు వివిధ సంక్షేమ పథకాలు, పలు అభివృద్ధి పనుల కోసం ఖర్చుచేశారు. కరోనా సమయంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన సేవలు దేశం మొత్తం చంద్రగిరి వైపు చూసేలా చేశారు. ప్రస్తుతం ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చంద్రగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. తుడా చైర్మన్‌గా మోహిత్‌రెడ్డి ప్రజలకు మరింత దగ్గరై, నిత్యం అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలపై తక్షణం స్పందిస్తూ పరిష్కరిస్తున్నారు. జనం కూడా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని కుటుంబంలో ఒకడిలా చూసుకుంటున్నారు. టీడీపీ తరఫున పులివర్తి నాని మరోమారు ఇక్కడ పోటీ చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ జెండా మరోసారి ఎగుర వేసేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారు.

వెంకటగిరి కోట రాముడికే మొగ్గు


వెంకటగిరి రాజా వారి కోటపై మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరనుంది. నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేతన్నలకు ఊపిరిపోశాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి విజయానికి మెట్లు. రాంకుమార్‌రెడ్డిపై స్థానికుల్లో మంచి అభిప్రాయం ఉంది. నాటి సీఎం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కుమారుడు కావడంతో నియోజకవర్గంలో వీరికి ప్రత్యేకంగా అభిమానులు ఉన్నారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా సమర్థవంతంగా రాణిస్తున్నారు. పోలేరమ్మ తల్లి జాతరను రాష్ట్ర పండుగగా జరిపించేలా చూడాలని సీఎం జగన్‌తో చర్చించి సాధించారు. వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో 1008 మంది లబ్ధిదారులకు సొంతింటి కలను నెరవేర్చారు. టీడీపీ అధికారంలో ఉన్నన్ని రోజులు వెంకటగిరిలో కురుగొండ్ల రామకృష్ణ ప్రభుత్వ నిధులను ఫలహారంగా మార్చుకున్నారు. తాను కూడా బినామీ కాంట్రాక్టర్‌గా అవతారమెత్తి రూ.కోట్లు జేబులో నింపుకున్నట్లు ఎద్దఎత్తున ఆరోపణలు ఉన్నాయి. దానికితోడు ప్రతి పనిలో కూడా వాటా ఇవ్వాల్సిందేననే ధోరణి కురుగొండ్లది.

ఆధ్యాత్మిక నగరంలో 'అభి'నవ అర్జునుడు

తిరుపతి అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి విజయం ఖాయం అని నగర ప్రజలు ఘంటాపథంగా చెబుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తనయుడిగా, డిప్యూటీ మేయర్‌గా ఆయన నగరంలో చేపట్టిన అభివృద్ధి కళ్ల ముందు సాక్షాత్కరిస్తోంది. సీఎం వైఎస్ జగన్ సహకారంతో స్మార్ట్‌సిటీ, మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో శ్రీవారి భక్తుల కోసం రూ.650.50 కోట్లతో తిరుపతిలో శ్రీనివాససేతును పూర్తి చేశారు. నగరంలో మురికికూపంగా ఉన్న వినాయకసాగర్‌ను రూ.42 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. అలాగే తిరుపతిలో రూ.70.92 కోట్లతో 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మించారు. ఇందిరా మైదానంలో రూ.40 కోట్లతో కచ్చపి ఆడిటోరియాన్ని నిర్మించారు. ఈ ప్రభుత్వంలో రూ.111.99 కోట్లతో 125.19 కి.మీ వరకు కొత్త అండర్ గ్రౌండ్ వ్యవస్థను ఏర్పాటు చేయిస్తున్నారు. నగరంలో 100 విద్యుత్ బస్సులు ఉన్నా యి. అత్యాధునిక హంగులతో 13 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్ల అంచనాలతో ఆర్టీసీ బస్టాండును నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. టీటీడీ సహకారంతో రూ.150 కోట్లతో చిన్నపిల్లల కార్డి యాలజీ విభాగం, మరో రూ.250 కోట్లతో చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ, రూ.400 కోట్లతో క్యాన్స ర్ ఆస్పత్రి, మరో 4 అర్బన్ హెల్త్‌సెంటర్లు ఏర్పాటు చేశారు. కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఇక్కడ నాన్ లోకల్. చిత్తూరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అవినీతి, అక్రమాలు లేవు. ఆరణిని తిరుపతి అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి ఆధ్యాత్మిక నగరంలో తమిళనాడు నుంచి తెచ్చుకున్న రౌడీలతో అలజడులు సృష్టిస్తుండడంతో స్థానికులు భగ్గుమంటున్నారు.

ముక్కంటి ఆశీస్సులు మధుసూదనుడికే..

శ్రీకాళహస్తిలో మరోమారు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి గెలుపు ఖాయం అనే సంకేతాలు వెలువడుతున్నాయి. గత 30 ఏళ్లలో జరగని అభివృద్ధి ఈ ఐదేళ్లలో చేసి చూపించారని ప్రజలు చెబుతున్నారు. పట్టణంలోని నాలుగు మాడవీధుల్లో రూ.14 కోట్లతో అండర్ గ్రౌండ్ విద్యుత్, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా శ్రీ–కాళ–హస్తి, నంది ప్రతిమలతో కూడిన అధునాతన టెక్నాలజీతో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. రూ.12 కోట్లతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిని 150 పడకలకు పెంచారు. రూ.16.5 కోట్లతో శ్రీకాళహస్తి నుంచి 21 కి.మీ గిరిప్రదక్షిణ మార్గం రోడ్డు, మండపా లు, మురుగునీటి కాల్వలను నిర్మించారు. ఈ మార్గంలో ప్రతిమాసం పౌర్ణమి రోజున కైలాసగిరి ప్రదక్షిణ చేస్తూ ముక్తి పొందుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో హిందూ శ్మశాన వాటికను 'దక్షిణ కైలాస ముక్తిధా మం' పేరుతో రూ.3 కోట్లతో అభివృద్ధి చేశారు. స్వర్ణముఖీనది ఆనకట్టను రూ.14.5 కోట్లతో అభివృద్ధి చేశారు. శ్రీకాళహస్తిని గ్రేడ్–1 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. శ్రీకాళహస్తిలో ఆర్డీఓ కార్యాలయం, రేణిగుంట లో ఈఎంసీ క్లస్టర్–2 పరిధిలో దాదాపు 20 పరిశ్రమలను కొత్తగా తీసుకొచ్చి దాదాపు 32 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ నిర్వహిస్తూ ప్రజలకు మరింతగా చేరువయ్యారు. కోవిడ్ సమయంలో నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి విషయానికి వస్తే.. ఇతను శ్రీకాళహస్తికి చుట్టపు చూపుగా వచ్చి వెళ్లడం ఈ కుటుంబానికి మొదటి నుంచీ ఉన్న అలవాటు. ఇతని మాట తీరు, వ్యవహారశైలి సొంత పార్టీలోని నాయకులకే నచ్చదనే టాక్ ఉంది.



పేటలో కిలివేటి హ్యాట్రిక్ పక్కా

1983 నుంచి టీడీపీకి కంచుకోటగా ఉన్న సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని వైఎస్సార్‌సీపీ బద్దలు కొట్టింది. 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో గెలిచిన కిలివేటి సంజీవయ్య, 2019లో జరిగిన ఎన్నికల్లో 62000 మెజార్టీతో గెలిచారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో సూళ్లూరుపేటలో వైఎస్సార్‌సీపీ జెండా హ్యాట్రిక్‌గా రెపరెపలాడనుంది. సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా ప్రజలకు అందించేలా కిలివేటి చొరవ చూపారు. నియోజకవర్గంలో రూ.1600 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం కూడా కిలివేటికి కలిసొచ్చే అంశం. కూటమి అభ్యర్థి నెలవల విజయశ్రీ రాజకీయాలకు కొత్త. ఈమె తండ్రి గంగా ప్రసాద్‌పై ప్రజల్లో సదాభిప్రాయం లేదు.

పారిశ్రామికవాడకు కాబోయేది 'రాజేష్'

సత్యవేడులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ విజయానికి నాడు వైఎస్సార్, నేడు సీఎం వైఎస్ జగన్ పారిశ్రామిక ప్రగతి, నియోజకవర్గ అభివృద్ధి దోహదపడనున్నారు. ఈ ఐదేళ్ల కాలంలో 2,200 ఎకరాలతో శ్రీసిటీ రెండో దశ విస్తరణ పనులు చేపట్టేందుకు కృషి చేశారు. దీంతో మరో రూ.2 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు నిర్మాణాల్లో ఉన్నాయి. శ్రీసిటీ వెలుపల రూ.400 సీసీఎల్ కాఫీ పరిశ్రమ విస్తరణ చేపట్టా రు. కంచరపాలెం వద్ద రూ.325 కోట్లతో రెండో యూనిట్ నెలకొల్పబడింది. సత్యవేడు ను ఏపీ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో రూ.1790 కోట్లతో ఏడు పరిశ్రమలు కొత్తగా రూపుదిద్దుకు న్నాయి. ఆరణియార్ ప్రాజెక్టు అభివృద్ధితో పాటు రూ.22 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు జరిగాయి. వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచి ఐదేళ్లు అధికారం అనుభవించి, ఇప్పుడు టీడీపీ అభ్యర్థి ఆదిమూలం ఓటమి ఖాయమైంది.

గూడూరు.. 'మేరిగ'దే..

గూడూరు ప్రజలు సౌమ్యుడు, వివాదాలకు దూరంగా ఉండే మేరిగ మురళీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క గూడూరు పట్టణంలోనే సుమారు రూ.50 కోట్లతో రైతు బజార్, కూరగాయల మార్కెట్, అగ్రిల్యాబ్, అర్బన్ హెల్త్ సెంటర్లు, 100 పడకల ఆస్పత్రి నిర్మించారు. నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది. ఇకపోతే.. కూటమి అభ్యర్థి సునీల్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలిచాక వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే టీడీపీలో చేరానని చెప్పుకొచ్చారు. రహదారులు, నవాబుపేట నుంచి పూడిరాయిదరువు ప్రాంతాల్లో రహదారులు ఏర్పా టు చేస్తానని, చిల్లకూరు మండలం వల్లిపేడు చెరువుకు తెలుగుగంగ నీటిని తీసుకొస్తానని చెప్పి చేతులెత్తేశారు. ఇకపోతే సిలికా మినరల్ ఫండ్ పేరుతో పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇతన్ని ప్రజలు పూర్తిగా తిరస్కరించడం ఖాయం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited Sakshi Press, Survey No 2/4, Kothapalem Village, Renigunta Mandal, Tirupati Revenue Division, Tirupati Dist - 517 520, and Printed at Jagati Publications Limited Survey No 2/4, Kothapalem Village, Renigunta Mandal, Tirupati Revenue Division, Tirupati Dist - 517 520 Editor: V. Murali (Responsible for selection of News under the PRB Act) Phone No.0877-2275378 Fax No. 0877-2271213, RNI Regn No. APTEL/2008/23805.